సాక్షి
విజయనగరం
ఆదివారం । 23 । జూన్ । 2024



షాక్ కొడుతున్నాయ్.. - 8లో
ఇటీవల పాలకొండ మండలం అంపిలి గ్రామానికి చెందిన రైతు ఆలుబిల్లి అప్పలనాయుడు తన పంటకు మోటారు ద్వారా నీరు అందించేందుకు వేకువజామున పొలానికి వెళ్లాడు.



కట్టుకున్నవాడే కడతేర్చాడు..
గజపతినగరం మండలంలోని బంగారమ్మపేటలో ఇటీవల జరిగిన ఓ వివాహిత ఆత్మహత్య కేసులో ఆమెది ఆత్మహత్య కాదు... హత్య అని పోలీసులు నిర్ధారించారు. - 8లో

'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ' రేపు
విజయనగరం అర్బన్: కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి బదులుగా కొత్త ప్రభుత్వం ఆధ్వర్యంలో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ'ను ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ఈ నెల 24 నుంచి ప్రతి సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

కలెక్టర్‌గా బీఆర్‌అంబేద్కర్ నియామకం

• నాగలక్ష్మికి గుంటూరు బదిలీ



బీఆర్ అంబేద్కర్, నూతన కలెక్టర్



ఎస్.నాగలక్ష్మి, బదిలీ కలెక్టర్

విజయనగరం అర్బన్: జిల్లా నూతన కలెక్టర్‌గా బీఆర్ అంబేద్కర్ నియమితులయ్యారు. ఇంతవరకు ఆయన విద్యాశాఖలో మధ్యాహ్న భోజన పథకం డైరెక్టర్‌గా ఉన్నారు. అలాగే ప్రస్తుత కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి గుంటూరు జిల్లాకు బదిలీ అయింది. గత ఏడాది ఏప్రిల్ 12న జిల్లా కలెక్టర్‌గా అనంతపురం నుంచి ఆమె వచ్చారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శనివారం విడుదల చేసిన కలెక్టర్ల జాబితాలో పేర్కొన్నారు. నూతనంగా వచ్చే కలెక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు గతంలో ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఆర్‌డీఓగా, పార్వతీపురం మన్యం జిల్లాలో ఆర్‌డీఓగా పనిచేసిన అనుభవం ఉంది.

నేడు ఒలింపిక్ డే రన్

విజయనగరం: అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయనగరం జిల్లా కేంద్రంలో ఆదివారం ఒలింపిక్ డే రన్ నిర్వహించనున్నట్లు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్ వేణుగోపాలరావు తెలిపారు. ఆదివారం ఉదయం 7 గంటలకు నగరంలోని ఆర్‌అండ్‌బీ జంక్షన్ నుంచి ప్రారంభమయ్యే ఈ రన్ ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు సాగుతుందని చెప్పారు. ఈ రన్‌ను జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు గురాన అయ్యలు ప్రారంభిస్తారని తెలిపారు.

ట్రాఫిక్ పోలీసులపై దాడి

విజయనగరం క్రైమ్: విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై ఓ తాగుబోతు దాడి చేశాడు. దీనిపై వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు శనివారం రాత్రి అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక మయూరి కూడలి వద్ద ట్రాఫిక్ ఎస్సై లోవరాజు, కానిస్టేబుళ్లు, హోంగార్డు కలిసి డ్రంకన్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్నారు. రాత్రి 9 గంటల ప్రాంతంలో మెరకముడిదాం మండలం గర్భాంనకు చెందిన ఆలుగుబిల్లి నరేష్ అనే వ్యక్తి మద్యం మత్తులో అటుగా వస్తున్నాడు. అతడిని పోలీసులు ఆపి టెస్ట్ చేసేందుకు ప్రయత్నిస్తుండగా.. ఒక్కసారిగా ఎస్సై లోవరాజు, సిబ్బందిపై చేయి చేసుకున్నాడు. వెంటనే స్పందించిన పోలీసులు అతన్ని పట్టుకుని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. బాధిత ట్రాఫిక్ పోలీసుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల సీజ్
రేగిడి: మండలంలో నాగావళి నది నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్లను అధికారులు పట్టుకుంటున్నారు. మండలంలోని సంకిలి నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లతో పాటు బూరాడ ప్రధాన రహదారి మీదుగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మరో రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తహసీల్దార్ రాములమ్మ శనివారం విలేకరులకు తెలిపారు.

జగన్నాథునికి జ్యేష్టాభిషేకం



జగన్నాథునికి జ్యేష్టాభిషేకం చేస్తున్న అర్చకుడు

విజయనగరం టౌన్: స్థానిక సంతపేట జగన్నాథస్వామి ఆలయంలో స్వామివారికి దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు ఫణిహారం మణికంఠ స్వామి నేతృత్వంలో జేష్టాభిషేకాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయం వెలుపలకు బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథస్వామిలను తీసుకువచ్చి జ్యేష్టాభిషేకాలు చేశారు. మారు రథయాత్ర వరకూ ఆలయంలో స్వామివారి విగ్రహమూర్తుల దర్శనం లభించదని అర్చకులు ఈ సందర్భంగా తెలిపారు. ఉల్లివీధి కాళ్ల నాయుడు రామమందిరంలో ఉన్న జగన్నాథ స్వామికి సూర్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో జ్యేష్టాభిషేకాలు ఘనంగా నిర్వహించారు.

దరఖాస్తులాహ్వానం

సీతానగరం: ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో (డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాలు) ఉమ్మడి విజయనగరం జిల్లాలో 2024-25 విద్యాసంవత్సరంలో 6నుంచి 9వ తరగతి వరకు ఉన్న ఖాళీ సీట్లను భర్తీ చేయడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల జిల్లా సమన్వయకర్త టి.పద్మజ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆమె సీతానగరం మండలంలోని జోగింపేట సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో మాట్లాడుతూ ఉమ్మడి విజయనగరం జిల్లాలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విద్యాలయాల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేయాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలోసంబంధిత (విద్యార్థి ఎక్కడ చేరాలనుకుంటే) విద్యాలయాల్లో ఈనెల 25 లోగా దరఖాస్తులు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన ప్రవేశ పరీక్ష ఈనెల 27న విద్యాలయాల్లో నిర్వహించనున్నామని తెలిపారు.

పామాయిల్ రైతుల ధరహాసం

• మంచి ధర పలుకుతున్న పంట
• సబ్సిడీపై మొక్కల అందజేత
• జిల్లాలో 15వేల ఎకరాల్లో సాగు
• మరో 5వేల ఎకరాల్లో సాగుకు సన్నాహాలు
• టన్ను ధర రూ.13 వేలు
• జిల్లాలో సాగు చేస్తున్న రైతులు 1600మంది



సంగంవలసలో సాగులో ఉన్న పామాయిల్ తోట

పార్వతీపురం మన్యం జిల్లాలో పంట విస్తీర్ణం ఎకరాల్లో..

పంట విస్తీర్ణం	12,500
ఎకరాకు దిగుబడి	10టన్నులు
అదనంగా పంట విస్తీర్ణం	5వేల ఎకరాలు

జిల్లాలో ఆయిల్ పాం సాగు ఇలా..

మండలం	ఆయిల్ పాం
కురుపాం	946.90
కొమరాడ	1870.00
గరుగుబిల్లి	379.12
గుమ్మలక్ష్మీపురం	12.85
జియ్యమ్మవలస	446.30
పాచిపెంట	1450.00
పార్వతీపురం	1350.00
పాలకొండ	160.50
బలిజిపేట	526.56
భామిని	84.00
మక్కువ	2660.00
వీరఘట్టం	200.68
సాలూరు	4100.00
సీతానగరం	1000.67

పార్వతీపురం టౌన్:

గతంలో ఊహించినంతగా గిట్టుబాటు ధర దక్కక పోయినా పెంచిన మొక్కలు ఇస్తున్న కొద్దిపాటి ఆదాయాన్నే నమ్ముకుని ఆరేళ్లపాటు పామాయిల్ రైతులు నిరీక్షించారు. టన్నుకు రూ.10వేలు ధర కావాలంటూ ఒకప్పుడు ఆందోళన చేశారు. అటువంటిది ఇప్పుడు ఏకంగా టన్నుకు రూ.12,250 వేలు అందుకుంటున్నారు. గత జనవరి నుంచి మార్చి వరకు టన్నుకు రూ.11 వేల ధర లభించగా ఏప్రిల్‌లో ఒక్కసారిగా రూ.11,550కు ధర పెరిగింది. ఈ నెలలో అయితే ఆ ధరను రూ.13 వేలకు చేరింది. ఈ మేరకు రాష్ట్రంలోని 13 పామాయిల్ ఫ్యాక్టరీలకు గత రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడంతో పామాయిల్ తోటలు సాగుచేస్తున్న రైతులకు అదృష్టం పట్టింది.



ట్రాక్టర్‌లో రవాణాకు సిద్ధంగా ఉన్న పామాయిల్ గెలలు

నూనె ధరలు పెరగడంతో..
అంతర్జాతీయంగా వంటనూనెల ధరలు పెరగడం, గతంలో రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధ పరిణామాలు, థాయిలాండ్ పామాయిల్ ఎగుమతులను నిషేధించడం వంటి పరిణామాల నేపథ్యంలో స్థానికంగా పండే పంటకు ధర పెరిగింది. గతంలో నూనె దిగుబడి 16.8గా లెక్కించి ధర చెల్లించేవారు. రైతులకు నష్టం వాటిల్లేది. ఈ నేపథ్యంలో మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి జోక్యం చేసుకుని పొరుగు రాష్ట్రం తెలంగాణలో మాదిరిగానే మన రాష్ట్రంలో కూడా పామాయిల్ పంటకు ధర ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్రంలో మాదిరిగానే మన రాష్ట్రంలో కూడా నూనె దిగుబడి 18.6 శాతంగా లెక్కించి రైతులకు మద్దతు ధర చెల్లిస్తున్నారు. ఎకరాకి సుమారు 10 టన్నుల నుంచి 12 టన్నుల వరకు దిగుబడి వస్తుండడం, ధర పెరగడంతో రైతులంతా పామాయిల్ సాగుపై మొగ్గుచూపుతున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ఇప్పటి వరకు 15,187.58 ఎకరాల్లో పామాయిల్ సాగులో ఉండగా, మరో 5వేల ఎకరాల్లో పంటసాగు విస్తరింపజేసేందుకు ఉద్యాన అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

ధర పెరగడం సంతోషకరం



ప్రభుత్వం పెంచిన ధర ప్రస్తుతం రైతులకు గిట్టుబాటవుతోంది. గతంలో టన్నుకు రూ.10వేలు మాత్రమే వచ్చేది. ప్రస్తుతం టన్నుకు రూ.13వేలు వస్తోంది. ధర పెరగడంతో అదనంగా మూడెకరాల్లో పామాయిల్ మొక్కలను సాగుచేస్తున్నాను. మిల్లర్లు టన్నుకు రూ.900లు తక్కువగా చెల్లించి తరువాత వాటిని ఎరియర్స్ రూపంలో ఇస్తున్నారు.
– ఎస్. సత్యనారాయణ, ఆయిల్‌పామ్ రైతు, పార్వతీపురం మండలం

రైతులకు చాలా ఉపయోగకరం



పామాయిల్ పంటకు ధర పెరగడం రైతుకు లాభదాయకం. ప్రస్తుతం టన్ను ధర రూ.13 వేలు పలుకుతోంది. అధికమంది రైతులు పామాయిల్ తోటల సాగుకు ఆసక్తి చూపుతున్నారు. మొక్కలను రాయితీపై అందిస్తున్నాం. మొక్కలు కావాల్సిన రైతులకు సమయానికి అందజేస్తాం.
– క్రాంతి, ఇన్‌చార్జి జిల్లా ఉద్యానశాఖాధికారి, పార్వతీపురం మన్యం

నా మాటే శాసనం



సచివాలయంలో రెవెన్యూ కార్యదర్శి కుర్చీలో కూర్చున్న టీడీపీ నాయకురాలు అనురాధ బేగం, పక్కన సందర్శకుల కుర్చీలో కూర్చున్న అడ్మిన్ కార్యదర్శి



సచివాలయం ముందు గ్రూప్ ఫొటోలో టీడీపీ నాయకురాలు

• సచివాలయంలో టీడీపీ నేత పెత్తనం
• ఉద్యోగి కుర్చీలో కూర్చుని అజమాయిషీ

విజయనగరం: సార్వత్రిక ఎన్నికల్లో గెలిచిన కొద్ది రోజుల వ్యవధిలోనే టీడీపీ నేతల పెత్తనం మొదలైంది. విజయనగరం జిల్లా కేంద్రంలోని 41వ డివిజన్ పరిధిలోని 49వ సచివాలయానికి వెళ్లిన అధికార పార్టీ నాయకురాలు అనురాధ బేగం నేరుగా సచివాలయ రెవెన్యూ కార్యదర్శి కుర్చీలో కూర్చుని అక్కడి ఉద్యోగులపై పెత్తనం చెలాయించడం చర్చనీయాంశంగా మారింది. గతంలో కానీ, ప్రస్తుతం కానీ ఎటువంటి పదవిలో లేని ఆమె ఉద్యోగి కుర్చీలో కూర్చుంటే సచివాలయ అడ్మిన్ కార్యదర్శి సందర్శకుల కుర్చీలో కూర్చున్నారు. అంతేకాకుండా స్థానిక టీడీపీ నాయకులను వెంట తీసుకువెళ్లి సచివాలయ ఉద్యోగులకు వారిని పరిచయం చేసి వారు చెప్పినట్లు నడుచుకోవాలంటూ హుకుం జారీ చేసినట్లు తెలుస్తోంది. చివరిలో ఆమె సచివాలయ సిబ్బందితో గ్రూప్ ఫొటో దిగడం విశేషం. ఈ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతుండడంతో ఎటువంటి పదవులు లేని వ్యక్తులు ఉద్యోగులపై అజమాయిషీ చెలాయించడం ఎంతవరకు సమంజసమంటూ చర్చించుకుంటున్నారు. ఈ విషయమై కార్పొరేషన్ కమిషనర్ ఎం.మల్లయ్యానాయుడు దగ్గర ప్రస్తావించగా ఆ విషయం తన దృష్టికి రాలేదని, పరిశీలించి చర్యలు తీసుకుంటామని సమాధానమిచ్చారు.

• చండీహోమం



వేదపండితులతో చండీహోమంలో పాల్గొన్న భక్తులు

విజయనగరం జిల్లా కేంద్రంలో గల చదురుగుడిలో పైడితల్లి అమ్మవారి జన్మనక్షత్రం, పౌర్ణమి కలిసి రావడంతో చండీహోమం నిర్వహించారు. తమ కోరికలు నెరవేరాలని ఆశిస్తూ జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ఆలయంలో శనివారం నిర్వహించిన చండీహోమంలో పాల్గొన్నారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

మనల్ని ఎవడ్రా ఆపేది?


• అధికార పార్టీ నేతల అడ్డగోలు తవ్వకాలు
• పట్టించుకోని రెవెన్యూ అధికారులు
• రాకోడు గ్రామంలోని చెరువుల్లో అనుమతుల్లేకుండా తవ్వకాలు

విజయనగరం రూరల్: కూటమితో కూడిన తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టి వారం రోజులైనా గడవక ముందే ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు బరితెగించి అక్రమాలకు తెరలేపారు. అధికార పార్టీ అండ చూసుకుని అడ్డగోలు తవ్వకాలకు శ్రీకారం చుట్టారు. గ్రామాల్లోని చెరువుల్లో ఎటువంటి అనుమతులు తీసుకోకుండానే యథేచ్ఛగా తవ్వకాలకు పాల్పడుతూ వేలాది రూపాయలు వెనకేసుకుంటున్నారు. అక్రమాలను అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులు అధికార పార్టీ నేతల బెదిరింపులకు భయపడి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో జలవనరులు కనుమరుగవుతున్నాయి.

రెండు గ్రామాల రైతుల ఆవేదన
విజయనగరం మండలంలోని రాకోడు గ్రామంలో కొత్త చెరువు, రామరాజు చెరువులు ఉన్నాయి. వాటి ఆయకట్టు కింద వందల ఎకరాల సాగుభూమి ఉంది. పినవేమలి, రాకోడు గ్రామాల రైతుల పొలాలకు ఈ రెండు చెరువుల సాగునీరే ఆధారం. అయితే అధికార పార్టీకి చెందిన పినవేమలి గ్రామంలోని ఓ కాంట్రాక్టర్ బరితెగించి చెరువులో మట్టిని జేసీబీతో తవ్వి రాత్రీపగలూ తేడా లేకుండా మూడు రోజులుగా లారీల్లో తరలించి విక్రయిస్తున్నాడని రెండు గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు. చెరువులను లోతుగా తవ్వడంతో చెరువులు నిండినా సాగునీటి మదుములకు నీరు అందదని, దీంతో పంటల కాలంలో చెరువుల్లో నీరున్నప్పటికీ వచ్చే అవకాశం ఉండదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారం చేపట్టిన వారం రోజులకే ఆపార్టీ నాయకులు ఇలా అక్రమాలకు తెరలేపి యథేచ్ఛగా మట్టి దందా కొనసాగించడం భావ్యం కాదని వాపోతున్నారు. రెవెన్యూ అధికారులు కలగజేసుకుని అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ పీవీ రత్నం వివరణ కోరగా అక్రమ తవ్వకాలు జరుగుతున్నట్లు తన దృష్టికి రాలేదన్నారు. వెంటనే ఆయన వీఆర్వోను పిలిపించి అక్రమ తవ్వకాల విషయమై ప్రస్తావించగా రెండు, మూడు రోజులుగా అధికార పార్టీకి చెందిన వ్యక్తి జేసీబీతో చెరువులో మట్టిని లారీల్లో తరలిస్తున్నాడని, అనుమతులు తీసుకోకుండా మట్టిని తవ్వరాదని హెచ్చరించామని తెలిపారు.



పీవీ రత్నం, తహసీల్దార్



కొత్త చెరువులో మట్టిని తవ్వుతున్న అధికార పార్టీ నేతకు చెందిన జేసీబీ

రాయితీపై విత్తనాలు



బొండపల్లి ఆర్బీకేలో పంపిణీకి సిద్ధంగా ఉన్న వరి విత్తనాలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

• కేజీకి రూ.10 సబ్సిడీతో వరి వంగడాల పంపిణీ
• ఆర్బీకేల్లో విక్రయం ప్రారంభం
• ఎకరాకు 30 కేజీల బస్తా చొప్పున రైతుకు అందజేత

బొండపల్లి:

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు రాయితీపై వరి విత్తనాలు అందిచడానికి రైతు భరోసా కేంద్రాల్లో వరి విత్తనాలను వ్యవసాయ శాఖ అధికారులు అందుబాటులో ఉంచి పంపిణీకి చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే అధికారులు చాలా వరకు ఆర్బీకేల్లో విత్తనాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేశారు. గజపతినగరం వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలో బొండపల్లి, దత్తిరాజేరు, మెంటాడ, గజపతినగరం మండలాలు ఉన్నాయి. ఈ నాలుగు మండలాల పరిధిలో గత ఏడాది వరి పంటను 13,500 హెక్టార్లలో రైతులు సాగు చేశారు. గత ఏడాది ఆయా మండలాల్లోని కొన్ని గ్రామాల్లో వర్షాభావ పరిస్థితుల కారణంగా వరి నాట్లు సకాలంలో వేయకపోవడంతో పంట సాగు జరగలేదు.

14 వేల హెక్టార్లలో సాగుకు ప్రణాళికలు
ఈఏడాది వ్యవసాయ శాఖ అధికారులు నాలుగు మండలాల పరిధిలో 14 వేల హెక్టార్లలో వరి సాగు చేయడానికి అవకాశం ఉన్నట్లు గుర్తించి అందుకు తగిన విధంగా వివిధ రకాలైన వరి విత్తనాలను ముందస్తుగానే ఏపీ సీడ్స్ ద్వారా సిద్ధం చేసి సచివాలయాల పరిధిలోని ఆర్బీకేల్లో ఈనెల మొదటి వారంలోనే అందుబాటులో ఉంచారు. ఇక 30 కేజీల బస్తా 1121 వరి విత్తనాల ధర రూ.1200 కాగా, కేజీకి రూ.10 సబ్సిడీ పోను రైతులకు అందిస్తారు. ఏ రకం వరి విత్తనమైనా కేజీకి రూ.10 చొప్పున రాయితీ ఇస్తూ రైతులకు అందజేస్తున్నారు. సబ్ డివిజన్ పరిధిలో 80 శాతానికి పైగా రైతులు 1121 రకం వరి పంటను గడిచిన 5 సంవత్సరాలుగా సాగు చేస్తున్నారు. దీంతో పాటు ఇతర రకాలను 20 శాతం వరకు సాగుచేస్తున్నట్లు తెలుస్తోంది. రైతులు సాగు చేస్తున్న 1121 రకం వరి విత్తనాలను 90 శాతం వరకు రైతులకు అందుబాటులో ఉంచి, పాస్‌పుస్తకం కలిగి ఉన్న ప్రతి రైతుకు ఒక బస్తాతో పాటు, రెండు ఎకరాలు దాటిన రైతులకు రెండు బస్తాలు చొప్పున విత్తనాలను అధికారులు పంపిణీ చేస్తున్నారు.

వరి విత్తనాల కేటాయింపు ఇలా..

మండలం	వరి రకం	కేటాయించిన విత్తనాలు (క్వింటాల్స్)
గజపతినగరం	1121	1930
బొండపల్లి	1121	1725
మెంటాడ	1121	1955
దత్తిరాజేరు	1121	1998

వీటితో పాటు బీపీటీ 5204, బీపీటీ 3291, ఎంటీయూ 1124 రకంతో పాటు ఇతర రకాలైన వరి విత్తనాలన్నీ కలిపి సబ్ డివిజన్ పరిధిలో 8,490 వేల క్వింటాళ్లు రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉంచి పంపిణీ చేపడుతున్నారు.

రైతులందరికీ విత్తనాలు అందించేలా చర్యలు



అన్ని రకాలైన వరి విత్తనాలను కేజీకి పది రూపాయలు చొప్పున సబ్సిడీపై రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు పంపిణీ చేస్తున్నాం. అర్హత ఉన్న ప్రతి రైతుకు సబ్సిడీ విత్తనాలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నాం. ముందుగా రైతులు తమకు కావాల్సిన విత్తనాల వివరాలను ఆర్బీకేల్లో ఆన్‌లైన్ చేసుకున్న తర్వాత అందిస్తున్నాం.
– కె.మహరాజన్, ఏడీఏ, గజపతినగరం సబ్‌డివిజన్

డాక్టర్ గారు ఇక లేరు

• గుండెపోటుతో హఠాన్మరణం



డాక్టర్ శెట్టి మధుసూదన్‌రావు (ఫైల్)

కొమరాడ: జిల్లాలోని కొమరాడ మండలం మాదలింగి గ్రామానికి చెందిన డాక్టర్ శెట్టి మధుసూదన్ రావు అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించారు. ఇంతవరకు మండల ప్రజలకు రాజకీయంగా, వైద్యపరంగా ఎన్నో సేవలు అందించిన ఆయన ఇక లేరన్న వార్త తెలియగానే మండలంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులతో పాటు, పార్టీ నాయకులు, ప్రజలు ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు. కొమరాడ ఎంపీపీ శెట్టి శ్యామల భర్త డాక్టర్ మధుసూదన్‌రావు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడిగా మండలంలో పార్టీకి తన సేవలు అందించారు. ఆయన శనివారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో గుండెపోటుతో ఇంటి వద్ద హఠాన్మరణం చెందారన్న విషయం తెలుసుకున్న వెంటనే వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దన రావు, పార్టీ నాయకులు కొలింగ మల్లేశ్వర రావు, వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబుతో పాటు పలువురు సీనియర్ నాయకులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి డాక్టర్ మధుసూదన రావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

జెడ్పీచైర్మన్ దిగ్భ్రాంతి
విజయనగరం రూరల్: కొమరాడ ఎంపీపీ శెట్టి శ్యామల భర్త డాక్టర్ మధుసూదనరావు ఆకస్మిక మృతి పట్ల, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణవార్త తెలిసిన వెంటనే ఎంపీపీ శ్యామలకు ఫోన్ చేసి పరామర్శించారు. ఇలాంటి కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

క్లుప్తంగా

వైభవంగా జ్యేష్ట పౌర్ణమి


స్వామి సన్నిధిలో పూజలు చేస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: జ్యేష్ట పౌర్ణమి సందర్భంగా సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామ స్వామి దేవస్థానంలో ఆలయ అర్చకులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామున స్వామికి ప్రాతః కాలార్చన, బాలభోగం నిర్వహించిన తర్వాత యాగశాలలో హోమాలు చేపట్టి సీతారాముల కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. అనంతరం ఉష్ణతాపం తగ్గాలని ఆకాంక్షిస్తూ స్వామికి పంచామృతాలతో విశేష అభిషేకాలు చేపట్టారు. ఉత్సవ మూర్తుల వద్ద విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, నవ కలశారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం పైనుంచి జారిపడి ఒకరి మృతి


ఉమామహేశ్వరరావు మృతదేహం

నెల్లిమర్ల రూరల్: విద్యుత్ స్తంభం పైనుంచి జారిపడి కేబుల్ ఆపరేటర్ మృతి చెందిన సంఘటన నెల్లిమర్ల మండలంలోని ఆల్తిపాలెం గ్రామ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒమ్మి గ్రామానికి చెందిన వడ్డాది ఉమామహేశ్వరరావు(39) ఏపీ ఫైబర్‌నెట్‌లో కేబుల్ ఆపరేటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి ఆల్తిపాలెంలో కేబుల్ వైర్లు తెగిపోవడంతో మరమ్మతులు చేపట్టేందుకు వెళ్లాడు. గ్రామ సమీపంలో విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతులు చేపడుతుండగా ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అయన్ను కేంద్రాస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. మృతుడికి భార్య రూపావతి, కుమార్తె, కుమారుడున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై రామగణేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా : ఐదుగురికి గాయాలు

సీతంపేట: మండలంలోని ఆడలి వ్యూ పాయింట్ సమీపంలో శనివారం రాత్రి ఆటో బోల్తాపడిన సంఘటనలో ఐదుగురికి గాయాలయ్యాయి. శ్రీకాకుళం నుంచి ఆడలి గ్రామానికి గృహప్రవేశానికి వచ్చిన వీరంతా తిరుగు ప్రయాణంలో వెళ్తుండగా మార్గమధ్యలో ఘాట్ రోడ్‌లో ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో గాయపడిన ఐదుగురిని శ్రీకాకుళం మెడికవర్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై జగదీష్‌నాయుడు తెలిపారు.

షాక్ కొడుతున్నాయ్..

- అస్తవ్యస్తంగా విద్యుత్ కనెక్షన్లు
- వర్షాకాలంలో యమపాశాలుగా మారే ప్రమాదం
- జాగ్రత్తలు తప్పనిసరి : అధికారులు


పొలంలో వేలాడిన విద్యుత్ తీగలు


విద్యుత్ లైన్లలో లోపాలు సరిచేస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది (ఫైల్)

పాలకొండ రూరల్ : ఇటీవల పాలకొండ మండలం అంపిలి గ్రామానికి చెందిన రైతు ఆలుబిల్లి అప్పలనాయుడు తన పంటకు మోటారు ద్వారా నీరు అందించేందుకు వేకువజామున పొలానికి వెళ్లాడు. పంపుసెట్ ఆన్‌చేసిన వెంటనే విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. సరైన జాగ్రత్తలు తీసుకోకుండా పంప్ సెట్‌ను తాకడమో... అస్తవ్యస్త విద్యుత్ కనెక్షన్లో.. కారణం తెలియదు గాని ఓ వ్యక్తి నిండు ప్రాణం బలైంది. ఇది కేవలం ఓ ఉదాహరణ మాత్రమే. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. వేల మంది రైతు కుటుంబాలు ప్రస్తుత వర్షాలను నమ్ముకుని వ్యవసాయానికి పొలంబాట పడుతున్నారు. అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ లైన్లు ప్రస్తుత సీజన్‌లో యమపాశాలుగా మారి ప్రాణాలను బలిగొనే ప్రమాదం పొంచి ఉంది. ప్రస్తుత సీజన్‌లో అన్ని వర్గాల ప్రజలు విద్యుత్ సంబంధిత పరికరాలతో పొంచి ఉన్న ప్రమాదం పట్ల అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులు చెబుతున్నారు. రోజు రోజుకూ జనావాసాలు విస్తరిస్తుండడంతో గృహాలు, దుకాణాలకు అధికారులు విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నారు. ప్రధాన రహదారుల్లో, ఇరుకైన కూడళ్లలో విద్యుత్ తీగలను నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేయడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఎప్పటికప్పుడు విద్యుత్ షాక్‌ల కారణంగా సాధారణ ప్రజలు, రైతులు, మూగజీవాలు మృత్యువాత పడడం, క్షతగాత్రులుగా మారడం జరుగుతోంది. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు, ప్రజలు సంయుక్తంగా చర్యలు చేపట్టాల్సి ఉంది.

పొలాల్లో ప్రమాదభరితంగా...

విద్యుత్ విస్తరణలో భాగంగా గ్రామీణ ప్రాంత పంట పొలాల మీదుగా విద్యుత్ స్తంభాల ఏర్పాటు జరిగింది. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలు, గాలులు కారణంగా స్తంభాలు ఒరిగిపోవడం ద్వారా విద్యుత్ తీగలు కొంతమేర కిందకు వేలాడుతున్నాయి. దీనికితోడు పొలాలకు నీరుకట్టే క్రమంలో ఏర్పాటు చేసుకున్న పంపుసెట్లు షెడ్లలో రైతులు కచ్చితమైన ప్రమాణాలు పాటించకపోవడం పరిపాటిగా మారింది. ఈ తరహా పరిస్థితుల వల్ల ప్రస్తుత వర్షాకాలంలో ప్రమాదం పొంచి ఉంది. నియోజకవర్గంలో రైతులకు సంబంధించి విద్యుత్ 2,700, అన్నిరకాల విద్యుత్ వినియోగ కనెక్షన్లు సుమారు 68 వేల వరకు ఉన్నాయి. వీటికి సంబంధించి 28 వేల విద్యుత్ స్తంభాలు ఉండడంతో నిరంతర పర్యవేక్షణ జరపడం కష్టతరంగా మారింది. ఈ క్రమంలో ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. రైతులతో పాటు సాధారణ విద్యుత్ గృహోపకరణాలు, ఇళ్లలో వాడుకునే ఫ్రిజ్‌లు, రిఫ్రిజిరేటర్లు, మిక్సీలు, గ్రైండర్ల వాడకంలో జాగ్రత్తలు అవసరం.

పాటించాల్సిన జాగ్రత్తలు..

- పంపుసెట్లు వద్ద ఏర్పాటు చేసుకున్న విద్యుత్ బోర్డులపై నీరు చేరకుండా ప్లాస్టిక్ కవర్లతో రక్షణ కల్పించుకోవాలి.
- మోటారు ఉన్న ప్రాంతంతో పాటు విద్యుత్ స్విచ్ బోర్డు తడవకుండా చూసుకోవాలి.
- పొలంలో విద్యుత్ పరికరాలు వినియోగించే సమయంలో చేతికి, కాళ్లకి రబ్బరు గ్లౌజులు, చెప్పులువాడటం శ్రేయస్కరం.
- విద్యుత్ స్విచ్ బోర్డులకు సంబంధించి నాణ్యమైన వైర్లు వాడాలి. అలాగే ముందుగా గుర్తించిన చిన్న చిన్న సమస్యలను ఎలక్ట్రీషియన్ల ద్వారా పరిష్కరించుకుంటే మేలు.
- విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పనులు చేసే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలి.
- పొలాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలను గుర్తించినా, ప్రమాదం ఉందని భావించినా తక్షణమే విద్యుత్ శాఖాధికారులకు సమాచారం అందించాలి.
- రైతులతో పాటు గృహ విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి.
- ఇళ్ల పైభాగంలో, శ్లాబులకు దగ్గరగా విద్యుత్ తీగలుంటే అధికారుల దృష్టికి తీసుకువెళ్లి అవసరమైన చర్యలు చేపట్టాలి.

అవగాహన తప్పనిసరి



ప్రస్తుత సీజన్‌లో విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. ఈ క్రమంలో మా సిబ్బంది క్షేత్ర స్థాయిలో సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరిస్తున్నారు. ముఖ్యంగా పొలాల్లో సంచరించే రైతులు, మూగజీవాల పెంపకందారులు అప్రమత్తంగా వ్యవహరించాలి. సమస్యలు గుర్తించిన వెంటనే అధికారులుకు తెలియజేయాలి. విద్యుత్ వినియోగదారులు అవగాహనతో వ్యవహరించడంతో పాటు సహచరులకు జాగ్రత్తలపై సూచనలు చేయాలి.

– టి.గోపాలకృష్ణమూర్తి, ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, పాలకొండ.

ఉద్యానవన కోర్సులతో మంచి భవిష్యత్

- ఉద్యాన విశ్వవిద్యాలయ వీసీ డాక్టర్ జానకీరామ్


లోగో ఆవిష్కరిస్తున్న వీసీ జానకీరామ్

గరుగుబిల్లి : ఉద్యాన వన కోర్సులతో విద్యార్థులకు మంచి భవిష్యత్‌ను ఉంటుందని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయ ఉప కులపతి డాక్టర్ జానకీరామ్ అన్నారు. ఉల్లిభద్రలో గల వైఎస్సార్ ఉద్యాన కళాశాల వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ జానకీరామ్ విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ బి.ప్రసన్నకుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వెనుకబడిన ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో 2016లో ఉద్యాన కళాశాల ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కళాశాలలో చదువుకున్న వారెందరో ఉన్నత శిఖరాలు అధిరోహించారని చెప్పారు. అనంతరం కళాశాల లోగోను ఆవిష్కరించారు. వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సిబ్బంది డాక్టర్ నరసింహమూర్తి, డాక్టర్ రాజ్యలక్ష్మి, డాక్టర్ గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య


అజయ్‌కుమార్(ఫైల్)

శృంగవరపుకోట : మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన ఒకరు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పాగాటి అజయ్‌కుమార్ (35) పెయింటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. అయితే ఇతను మద్యానికి బానిసై అప్పులు చేస్తుండడంతో భార్య రమాదేవి ఎప్పటికప్పుడు మందలించేది. ఈ క్రమంలో శనివారం ఉదయం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఇంటిలో ఉరి వేసుకున్నాడు. వెంటనే స్థానికులు స్పందించి అజయ్‌ను ఎస్.కోట ఏరియా ఆస్పత్రికి తరలించగా...అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు స్పష్టం చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడి భార్య రమాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ ఓజీ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శారద కళావేదిక ప్రారంభం


రిబ్బన్ కట్ చేసి శారద కళావేదికను ప్రారంభిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: పోలీస్ సంక్షేమ ఆంగ్ల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు 'శారద కళావేదిక' అందుబాటులో ఉంటుందని ఎస్పీ ఎం. దీపిక తెలిపారు. శారద మెటల్స్, అల్లాయిస్ కంపెనీ సౌజన్యంతో నూతనంగా నిర్మించిన శారద కళావేదికను ఆమె శనివారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. పోలీస్ సంక్షేమ ఆంగ్ల పాఠశాల రోజురోజుకూ అభివృద్ధి చెందుతోందని చెప్పారు. ఇప్పటికే అనేక సౌకర్యాలతో కార్పొరేట్ స్కూల్స్‌కి దీటుగా తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్య అందిస్తున్నామని తెలిపారు. కొత్తవలసకు చెందిన శారద మెటల్స్ అండ్ అల్లాయిస్ కంపెనీ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పాఠశాల ఆవరణలో కళావేదికను నిర్మించడం అభినందనీయమన్నారు. శారద మెటల్స్ కంపెనీ సీనియర్ జీఎం. ప్రభాత్ మోహన్ మాట్లాడుతూ.. తమ కంపెనీ తరఫున సేవా కార్యక్రమాలు చేపట్టే క్రమంలో ఎక్కువగా విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుంటామన్నారు. అందులోభాగంగానే ఈసారి పోలీస్ సంక్షేమ పాఠశాలను ఎంపిక చేసి కళావేదిక నిర్మించామని తెలిపారు. అనంతరం కంపెనీ యాజమాన్యం పాఠశాల విద్యార్థులకు పెన్సిళ్లు, కేకులను ఎస్పీ ఎం.దీపిక చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఎం.ఎం.సోల్మన్, ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, శారద మెటల్స్ కంపెనీ సీనియర్ జీఎం విజయభాస్కర్, డీజీఎం హెచ్.సన్యాసిరావు, ఎస్బీ సీఐ కేకేవీ విజయనాథ్, ఆర్ఐలు ఎన్.గోపాలనాయుడు, ఆర్.రమేష్‌కుమార్, భగవాన్, వెల్ఫేర్ ఆర్ఐ వరప్రసాద్, ఎస్సై అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ పి.సంధ్య , పలువురు ఆర్ఎస్సైలు, పోలీస్ అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అత్యవసర పరిస్థితులు ఎదుర్కోవడానికి సిద్ధం..

- విపత్తుల శాఖ డీపీఎం రాజేశ్వరి


ప్రాక్టికల్‌గా అవగాహన కల్పిస్తున్న అధికారులు


హాజరైన యూత్ వలంటీర్లు

విజయనగరం అర్బన్: ప్రకృతి వైపరీత్యాల వల్ల సంభవించే అత్యవసర పరిస్థితులను ఎదుర్కోడానికి ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని విపత్తుల శాఖ డీపీఎం రాజేశ్వరి తెలిపారు. విపత్తులు సంభవించినపుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై ప్రజలందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. శనివారం స్థానిక యూత్ హాస్టల్‌లో యూత్ వలంటీర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో ఇటువంటి అవగాహన సదస్సులు నిర్వహించి, ప్రజలను చైతన్యపరచాలన్నారు. వరదలు, తుఫాన్లు, అగ్ని ప్రమాదాలు, భూకంపాలు, గుండె పోటు సంభవించేటప్పుడు, పిడిగులు పడే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. జిల్లాలో విజయనగరం, గంట్యాడ, గజపతినగరం, నెల్లిమర్ల, పూసపాటిరేగ, భోగాపురం, సంతకవిటి, వంగర, బొబ్బిలి మండలాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో తహసీల్దార్ రత్నం, ఎన్డీఆర్ఎఫ్ ప్రతినిధులు, యూత్ వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో కిడ్నాప్ కలకలం

- ఆలస్యంగా వెలుగులోకి..
- రాజస్థాన్‌కి చెందిన ఆరుగురు కలిసి కిడ్నాప్‌కు పాల్పడిన వైనం
- వీడియోలు వైరల్ కావడంతో పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

విజయనగరం క్రైమ్: పట్టణంలో కిడ్నాప్ కలకలం చోటుచేసుకుంది. కిడ్నాప్ చేసిన వ్యక్తిని కారులో ఎక్కించి చితకబాదేసి, మూత్రం తాగించి రూ. 50 వేలు డబ్బులు తీసుకుని వదిలేశారు. రాజస్థాన్ వెళ్లి ఆ వీడియోలను వైరల్ చేయడంతో బాధితుడి కుటుంబ సభ్యులు చూసి తీవ్ర మనస్థాపానికి గురై శనివారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి వన్‌టౌన్ సీఐ బి. వెంకటరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజస్థాన్‌కి చెందిన భగవాన్‌రామ్ కుటుంబ సభ్యులతో కలిసి ఐదారేళ్లుగా విజయనగరం పట్టణంలోని డకినివీధిలో నివాసం ఉంటున్నాడు. గ్యాస్‌స్టవ్ అమ్మకాలు చేపడుతూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. రాజస్థాన్‌లో తన ఇంటి పక్కన ఉండే బీజూరామ్ అనే వ్యక్తితో భగవాన్‌రామ్‌కు తగాదాలుండేవి. సడన్‌గా రాజస్థాన్ నుంచి బిజూరామ్ ఈ నెల 14న విజయనగరం వచ్చి మయూరీ కూడలి వద్ద నుంచి భగవాన్ రామ్‌కి ఫోన్ చేసి కలుస్తానని చెప్పాడు. అయితే వారిద్దరి మధ్య ప్రస్తుతం ఎటువంటి తగాదాల్లేకపోవడంతో సరేనని చెప్పి భగవాన్‌రామ్ కలిశాడు. అనంతరం మద్యం తాగేందుకు వై జంక్షన్ సమీపంలో ఉన్న దాబా వద్దకు వెళ్లారు. అక్కడ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసర ప్రాంతంలో ఉన్న స్టార్ హోటల్‌కి వెళ్దామని కారులో వెళ్లారు. ఆ సమయంలో కారులో భగవాన్‌రామ్, బిజూరామ్‌తో మరో నలుగురున్నారు. కారును విశాఖ మీదుగా తణుకు వైపు తీసుకెళ్లడంతో అనుమానం వచ్చిన భగవాన్ రామ్ కేకలు పెట్టగా.. మా కుటుంబ సభ్యురాలికి ఫోన్ చేసి మాట్లాడతావా.. అని చెప్పి రాడ్డులు, కర్రలతో దాడి చేశారు. అప్పటికే బాటిల్‌తో ఉంచిన మూత్రాన్ని తాగించారు. తాము బెంగుళూరు నుంచి రావడానికి చాలా ఖర్చయిందని, లక్ష రూపాయలు ఇస్తేనే విడిచిపెడతామని చెప్పడంతో భగవాన్‌రామ్ తన మిత్రులకు ఫోన్ చేసి రూ. 50 వేల వరకు అందించాడు. ఆ డబ్బు తీసుకుని వారు భగవాన్‌రామ్‌ను తణుకులో వదిలేసి పరారయ్యారు. అయితే రాజస్థాన్ వెళ్లిన తర్వాత వారు చేసిన ఆకృత్యాలను సోషల్ మీడియాలో వైరల్ చేయడంతో భగవాన్‌రామ్ కుటుంబ సభ్యులు తీవ్ర మనస్థాపానికి గురై పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుని ఫిర్యాదు మేరకు ఎస్సై తారకేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోవులను రక్షించండి..

- గనిశెట్టిపాలెం గోశాల నిర్వాహకులు నిబంధనలు పాటించడం లేదు
- సినీ ఆర్టిస్ట్ కరాటే కల్యాణి ఆందోళన
- సీఐ జోక్యంతో ఆందోళన విరమణ


కరాటే కల్యాణితో చర్చిస్తున్న కొత్తవలస సీఐ చంద్రశేఖర్

కొత్తవలస : మండలంలోని గనిశెట్టిపాలెం గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న గోశాలలో నిబంధనలు పాటించడం లేదని, వెంటనే గోశాలను మూసి గోవులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ధార్మిక సంఘం తెలంగాణ స్టేట్ జాయింట్ కన్వీనర్, సినీ ఆర్టిస్ట్ కరాటే కళ్యాణి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సాయంత్రం గోశాల వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గోశాలలో ఉన్న గోవులు మాయం అవుతున్నాయని, నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలన్నారు. రెండు నెలల కిందట శ్రీకాకుళం జిల్లాలో నరసన్నపేట సమీపంలో అక్రమంగా రవాణ చేస్తున్న సుమారు 150 గోవులను పట్టుకొని అక్కడి పోలీసులకు అప్పజెప్పామన్నారు. అయితే పోలీసులు ఆ గోవులను గనిశెట్టిపాలెం గోశాలకు తరలించారని తెలిపారు. నాలుగు రోజుల తర్వాత గోశాలకు వచ్చి చూస్తే ఒక్క ఆవుకూడా లేదని.. ఇదే విషయమై గోశాల నిర్వాహకులను ప్రశ్నిస్తే పొంతన లేని సమాధానాలు చెప్పారన్నారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద అక్రమంగా తరలిస్తున్న 70 గోవులను శనివారం తాము పట్టుకుని, నక్కపల్లి సీఐ విజయ్‌కుమార్‌కు అప్పజెప్పామని తెలిపారు. అయితే ఈ గోవులను గనిశెట్టిపాలెం గోశాలకు మాత్రం తరలించవద్దని చెప్పినా, పోలీసులు మా మాట పట్టించుకోకుండా ఇక్కడకే తరలించారని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసుల తీరుపై అనుమానం వచ్చి తాము ఇక్కడకు రాగా.. కనీసం ఆవులకు నీరు, గడ్డి కూడా పెట్టలేదన్నారు. పైగా ఈ గోవులు రైతులవని గోశాల నిర్వాహకులు తెలపడం విడ్డూరంగా ఉందన్నారు. గోశాల నిర్వాహకులతో అధికారులు లాలూచీ పడ్డారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు. ముఖ్యంగా నక్కపల్లి సీఐ విజయకుమార్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. గోశాల ప్రాంగణాన్ని బీజేపీ నాయకులు, ధార్మిక సంఘ సభ్యులతో కలిసి ఆమె పూర్తి స్థాయిలో పరిశీలించారు.

సీఐ చొరవతో ఆందోళన విరమణ..

గోశాల వద్ద ఆందోళన చేస్తున్న కరాటే కల్యాణి వద్దకు కొత్తవలస సీఐ చంద్రశేఖర్ తన సిబ్బందితో వచ్చి ఆమెతో చర్చించారు. ఇక్కడ ఉన్న పశువులను తక్షణమే శ్రీకాకుళం జిల్లా బారువా గోశాలకు తరలిస్తామని, సంబంధిత వాహనాలను సీజ్ చేస్తామని, గోశాల నిర్వహణపై విచారణ చేస్తామని హామీ ఇవ్వడంతో కల్యాణి ఆందోళన విరమించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹145	₹266	₹270

కట్టుకున్నవాడే కడతేర్చాడు..

- పోలీసుల అదుపులో నిందితుడు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ శ్రీనివాసరావు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు (వెనుక ముసుగులో నిందితుడు)


హత్యకు ఉపయోగించిన నైలాన్ తాడు, గ్లౌజ్‌లు

గజపతినగరం : మండలంలోని బంగారమ్మపేటలో ఇటీవల ఓ వివాహిత ఆత్మహత్య చేసుకోవడంతో కేసు నమోదు చేసిన పోలీసులు అది ఆత్మహత్య కాదు...హత్య అని తేల్చారు. కట్టుకున్న భర్తే భార్యను అమానుషంగా చంపడంతో అతడ్ని అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు శనివారం స్థానిక గజపతినగరం పోలీస్ స్టేషన్ ఆవరణలో వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. బంగారమ్మపేటకు చెందిన నక్కా జగదీష్‌కు అదే గ్రామానికి చెందిన తాడుతూరి అనూష (తనూజ)తో మూడు నెలల కిందట వివాహం జరిగింది. మొదట్లో వీరి కాపురం సజావుగా సాగినా, జగదీష్‌కు అనుమానం ఎక్కువ కావడంతో ఇద్దరి మధ్య మనస్పర్థలు నెలకొన్నాయి. అక్కడకు కొద్ది రోజుల తర్వాత అనూషను కన్నవారింటిలో ఉంచి జగదీష్ ఉద్యోగం నిమిత్తం వేరే ప్రాంతానికి వెళ్లాడు. ఈ నెల 16న గ్రామానికి వచ్చిన జగదీష్ అనూషకు ఫోన్ చేసి ఇంటి సమీపంలో ఉన్న పశువుల శాల వద్దకు రమ్మన్నాడు. దీంతో ఆరోజు (ఆదివారం) రాత్రి అనూష తన ఇంటి సమీపంలోని పశువులశాల వద్దకు రాగా.. ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. సహనం కోల్పోయిన జగదీష్ భార్య మెడకు నైలాన్ తాడుతో ఉరి వేశాడు. ఇదిలా ఉండగా గ్రామానికి చెందిన బోని ప్రసాద్ అనే వ్యక్తి తనను వేధిస్తున్నాడని, అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నానని అనూష సెల్ నుంచి ఆమె తండ్రి, సోదరుడు, స్నేహితురాళ్లతో పాటు తన సెల్‌కు కూడా జగదీష్ మెసేజ్‌లు పంపించాడు. దీంతో మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు బోని ప్రసాద్‌ను పోలీసులు అరెస్ట్ చేసి విచారించగా.. అతను నేరం చేయలేదని తేలింది. ఈ పరిస్థితుల్లో భర్త జగదీష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా... అసలు విషయం బయట పడింది. భార్యను తనే హత్య చేసినట్లు జగదీష్ ఒప్పుకోవడంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

బోని ప్రసాద్ ఇంటిపై దాడి

తన కుమార్తె మృతికి కారణమనే అపోహతో అనూష తండ్రి, కుటుంబ సభ్యులు ప్రసాద్ ఇంటిపై దాడి చేసి అతని తండ్రి గోవిందరావుపై దాడి చేశారు. దీంతో గోవిందరావు ఫిర్యాదు మేరకు నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో స్థానిక సీఐ ఎన్‌వీ ప్రభాకరరావు, ఎస్సై యు.మహేష్, తదితరులు పాల్గొన్నారు.



సాక్షి సండే క్లాసిఫైడ్స్

EDUCATION

■ 10th / INTER / DEGREE ఫెయిల్ అయ్యారా? Don't Worry! Complete in Short period & Join further Studies in 2024-25 Academic Year. Pass Guarantee Guidence. Ph : 90599 10102 [V- 2602]

■ స్కూల్ ఆఫ్ నర్సింగ్ : GNM 3 Yrs. గవర్నమెంట్ & మేనేజ్‌మెంట్ సీట్స్ కలవు. అర్హత : ఇంటర్ (సైన్స్ & ఆర్ట్స్ గ్రూప్స్ వాళ్ళకు అవకాశం కలదు). సంప్రదించండి : 92466 75657 [V- 823808]

PLOT FOR SALE

■ కొత్తవలస మేజర్ పంచాయితీ లే-అవుట్‌లో 1000 చ॥గ॥, 40 అడుగుల తారురోడ్డుతో సౌత్ ఫేసింగ్‌లో మొత్తం గాని, భాగాలుగా గాని అమ్మకంకు కలదు & 1200 చ॥అ॥ డూప్లెక్స్ హౌస్ (సౌత్ ఫేసింగ్) కలదు. సంప్ర : 85001 90854 [V- 0189]

FOR RENT

■ SHOP FOR RENT Ground floor, Opp: Kanyaka parameswari Temple, Front shop & Back Side Godown 116ft Lenth Main road Vizianagaram. Ph: 8125895089. [S-1243451]

LAND FOR SALE

■ విజయనగరం నుంచి గజపతినగరం వెళ్ళే దారిలో హైవేకి దగ్గరలో 7 కోట్లతో రిసార్ట్ ప్లానింగ్ గల ఫార్మ్ ల్యాండ్ వెంచర్ కలదు. గజం 5000/- మాత్రమే. ఫోన్ : 99639 50241 [V- 2606]

HEALTH CARE

■ డా॥ నిర్మల వంగపండు MD - Gen, Med (DM-Neuro) Jimper మెదడు, నరములు, వెన్నెముక వ్యాధి నిపుణులు. ఆదివారం నుండి శుక్రవారం వరకు 9am to 6pm చూసెదరు. నిర్మల న్యూరో & జనరల్ మెడికల్ సెంటర్. VZM, Appointment : 63054 71147 [V- 1903]

WANTED

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185221]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం జీ:18K. ఫోన్: 9640258899/9640468899 [H-799894]

■ కష్టమైన్లే కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీ/ పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000-40000,ఫ్రీరూం+భోజనం.HYD. 6309020999 [HA-273]

■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-800412]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.